సాక్షి నిర్మల్

మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



నిర్మల్‌లోని నిస్సీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

క్రిస్మస్ సంబురాలు



క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న యువతులు



సీఎస్ఐ చర్చిలో ప్రార్థన గీతాలు ఆలపిస్తున్న యువతీ యువకులు



ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న చర్చి కమిటీ సభ్యులు



సీఎస్ఐ చర్చిలో క్రీస్తు బోధనలు చేస్తున్న పాస్టర్

ప్రార్థనలో యువతి



జిల్లాలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని తాకాయి. క్రీస్తు జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలియజేసే సెట్టింగులు ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. భక్తిగీతాలు ఆలపించారు. పాస్టర్లు క్రీస్తు సందేశం వినిపించారు. తర్వాత కేక్ కట్‌చేశారు. సోమవారం ఉదయం క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి చర్చిలకు చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకున్నారు. వెంకటాపూర్‌లోని నిస్సీ, గాజులపేటలోని సీఎస్ఐ, సెయింట్ థామస్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు ప్రభును స్మరించుకున్నారు. గాజులపేట సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. కేక్ కట్‌చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

- నిర్మల్‌టౌన్

న్యూస్‌రీల్

మంత్రికి స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న జిల్లా నేతలు

నిర్మల్: ఆదిలాబాద్‌లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్‌పార్టీ సన్నాహక సమావేశానికి వెళ్తున్న మంత్రులు, అగ్రనేతలకు జిల్లా నాయకులు స్వాగతం పలికారు. స్థానిక గంజాల్ టోల్ ప్లాజా వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్, మహేశ్ కుమార్‌గౌడ్ ఇతర సీనియర్లు, ప్రజాప్రతినిధులకు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఇందులో పార్టీ నాయకులు సాద సుదర్శన్, అర్జుమంద్‌అలీ, ఎంబడి రాజేశ్వర్, నాందేడపు చిన్ను, జునైద్‌మెమన్, గణేశ్, ఖిజర్, ఆకుల హరీశ్ తదితరులు ఉన్నారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ ఉద్యోగుల విశ్రాంత భవనంలో సోమవారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి వాజ్‌పేయి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. భారతీయ జనతాపార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేశారన్నారు. వాజ్‌పేయి స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంజుకుమార్‌రెడ్డి, నాగాచారి, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, మల్లికార్జున్‌రెడ్డి, మెడిసెమ్మ రాజు, అలివేలు మంగ, రాజేందర్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న వీడీసీ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ రూరల్ మండలం మేడిపెల్లి, సారంగాపూర్ మండలం ప్యారమూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని రెండు గ్రామాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందించారు. క్యాంపు కార్యాలయంలో కలిసి బస్సు సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ డిపో మేనేజర్‌తో చర్చించి బస్సు సౌకర్యం కల్పించేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిప్రిలో వీడీసీ సభ్యులపై కేసు

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామాభివృద్ధి కమిటీలోని నలుగురు సభ్యులపై సోమవారం కేసు నమోదు చేశామని ఎస్సై సాయికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన నరేశ్‌గౌడ్‌పై వీడీసీ సంఘ బహిష్కరణ చేసింది విదితమే. గ్రామంలో విచారణ చేపడుతున్నామని గ్రామ వీడీసీపై కేసు నమోదు చేశామన్నారు. ఎంత మందిపై కేసు నమోదు చేశామనేది త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

కారులో అవిశ్వాస పోరు..!

- జెడ్పీతోపాటు నిర్మల్ బల్దియాలో..
- చైర్మన్‌లపై పెరుగుతున్న వ్యతిరేకత
- బీఆర్‌ఎస్ ఓటమితో పీఠాలకు ఎసరు
- బీజేపీ, కాంగ్రెస్‌ల అండతో కదులుతున్న పావులు
- పెద్దగా స్పందించని మాజీ ప్రజాప్రతినిధులు



నిర్మల్: అధికారంలో ఉన్నంత వరకే రాజకీయం.. ఓడిపోతే అదెక్కడికైనా దారితీయొచ్చు. ఇప్పుడు జిల్లాలో ఇదే జరుగుతోంది. మొన్నటి వరకు దర్జాగా ఏలిన పాలకులు ఇప్పుడు పరేషాన్‌లో ఉన్నారు. పక్కపార్టీల కంటే సొంత పార్టీ నుంచే వాళ్ల పీఠాలను కదిలించాలన్న డిమాండ్ పెరుగుతోంది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌తోపాటు నిర్మల్ మున్సిపల్ చైర్మన్ స్థానాలపై అవిశ్వాస కత్తి వేలాడుతోంది. ఈ రెండు స్థానాల్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులే ఉన్నారు. అవిశ్వాసం కూడా అదే పార్టీ సభ్యుల నుంచి వస్తోంది. వీటితోపాటు భైంసా తదితర మండలాల ఎంపీపీ స్థానాలకూ ఎసరు తప్పేలా లేదు. ఉన్నదే ఐదారు నెలల పదవీకాలం.. అయినా వదిలేది లేదని అవిశ్వాసం కోరుతున్న సభ్యులంటున్నారు.

నిర్మల్ బల్దియాలో వ్యతిరేకత..

ఆది నుంచి నిర్మల్ మున్సిపాలిటీ ఏదో ఒక విషయం చర్చనీయాంశంగా నిలుస్తూనే వస్తోంది. శానిటేషన్‌లో 44 పోస్టుల అమ్మకం, మాస్టర్‌ప్లాన్‌పై వ్యతిరేకత అంశాల్లో రాష్ట్రస్థాయిలో నిర్మల్ బల్దియా పేరు వివాదస్పదంగా మారింది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండటం, ఇక్కడా ఆ పార్టీదే పాలకవర్గం కావడం, స్థానిక ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి రాష్ట్రమంత్రిగా ఉండటంతో ఎక్కడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అప్పటి నుంచే చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌పై తీవ్ర వ్యతిరేకత వచ్చినప్పటికీ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. కానీ ఇటీవల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలవ్వడం, స్థానిక మంత్రిగా ఉన్న అల్లోల కూడా ఓడిపోవడంతో పరిస్థితులు మారిపోయాయి. ఇప్పటికే నిర్మల్ బల్దియాలో బయటకు ఏర్పడకున్నా.. చైర్మన్‌కు అనుకూల, వ్యతిరేక వర్గాలుగా కౌన్సిలర్లు విడిపోయారు. చాలామంది ఈశ్వర్‌పై బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

చైర్మన్‌పై అవిశ్వాసం..

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్‌ను మార్చాలంటూ ఇటీవల మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై పలువురు సీనియర్ కౌన్సిలర్లు ఒత్తిడి తీసుకువస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రస్తుత చైర్మన్ ఈశ్వర్‌సహా ఆయన వర్గంగా భావిస్తున్న కౌన్సిలర్లూ కాంగ్రెస్‌లోకి వెళ్తామన్న సంకేతాలు ఇచ్చారు. ఈనేపథ్యంలోనూ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఆయనను దింపేసి, ఇతరులకు చాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే ఈ పంచాయితీ మాజీ మంత్రి అల్లోల వద్దకు వెళ్లింది. అయితే మున్సిపల్ విషయంలో తాను ఇప్పుడు జోక్యం చేసుకోలేనని చెప్పినట్లు సమాచారం.

తెరపైకి 'మేడారం'..

చైర్మన్ ఈశ్వర్‌ను తప్పిస్తే తదుపరి ఎవరిని చైర్మన్‌గా చేయాలన్న చర్చ బీఆర్‌ఎస్‌లో జరుగుతోంది. ఇందులో ప్రధానంగా 24వ వార్డు కౌన్సిలర్ మేడారం అపర్ణ పేరు వినిపిస్తోంది. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి విధేయుడిగా ఉన్న మేడారం ప్రదీప్ పార్టీలో సీనియర్‌నేతగా కొనసాగుతున్నారు. తొలిసారి 2005లో ప్రదీప్ కౌన్సిలర్‌గా గెలిచారు. ఆ తర్వాత మహిళ రిజర్వేషన్ రావడంతో వరుసగా రెండుసార్లు ఆయన భార్య అపర్ణ గెలిచారు. ఈశ్వర్‌ను తప్పిస్తే.. తమకే అవకాశం ఇవ్వాలని అపర్ణ ప్రదీప్ దంపతులు కోరుతున్నారు. నిర్మల్ మున్సిపాలిటీలో మొత్తం 42 వార్డులు ఉండగా, బీఆర్‌ఎస్‌కు 36, బీజేపీకి నలుగురు, ఎంఐఎంకు ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు ప్రస్తుతం ప్రాతినిధ్యం లేదు. బీఆర్‌ఎస్‌కు చెందిన 36 మందిలో మెజారిటీ కౌన్సిలర్లు చైర్మన్ మార్పునకు మద్దతు తెలుపుతున్నారు.

జెడ్పీలో ముసలం..

నిర్మల్ జిల్లా పరిషత్‌లోనూ ముసలం మొదలైంది. జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మిని మార్చాలన్న డిమాండ్ పెరుగుతోంది. మాజీ మంత్రి అల్లోల అండతో సీనియర్ నేత కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి తన భార్య విజయలక్ష్మిని నిర్మల్‌రూరల్ నుంచి జెడ్పీటీసీగా గెలిపించుకుని చైర్‌పర్సన్ చేయించుకున్నారు. ఆయనపైనా సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజాగా అసెంబ్లీ ఫలితాల ప్రభావంతో పలువురు జెడ్పీటీసీలు కాంగ్రెస్, బీజేపీ మద్దతుతో చైర్‌పర్సన్‌ను మార్చే దిశగా పావులు కదుపుతున్నారు. కాంగ్రెస్‌కు చెందిన పలువురు జెడ్పీటీసీలు చైర్‌పర్సన్ స్థానంపై గురిపెట్టినట్లు తెలుస్తోంది. 2019 మేలో ఎన్నికలు నిర్వహించగా మొత్తం 18 జెడ్పీటీసీలకు బీఆర్‌ఎస్ 12 స్థానాల్లో గెలిచి పీఠం దక్కించుకుంది. రాజకీయ పరిణామాల అనంతరం పలువురు జెడ్పీటీసీలు కాంగ్రెస్, బీజేపీలలో చేరారు. తాజాగా అవిశ్వాసపర్వం వైపు అడుగులు పడుతుండగా, బీఆర్‌ఎస్ దాదాపు చేతులెత్తేసే పరిస్థితిలో ఉంది.

28 నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ఆరు గ్యారంటీల అమలు కోసం అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. ఈనెల 28 నుంచి జనవరి 6 వరకు ఆరు గ్యారంటీలకు అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం సోమవారం అధికారులకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గం, మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులు మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా పథకాల కోసం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ఒకరోజు ముందు గ్రామాల్లో దండోరా(టామ్ టామ్)వేయించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో గ్రామపంచాయతీ, పట్టణ స్థాయిలో వార్డు ఆఫీసులలో దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

ఖానాపూర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

పేదల బియ్యం పక్కదారి!



భైంసాలో శనివారం సీసీఎస్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన రేషన్‌బియ్యం



నర్సాపూర్‌లో ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం(ఫైల్)

- రహస్య ప్రాంతాల్లో నిల్వలు, ఆపై వాహనాల్లో తరలింపు
- ఫిర్యాదు చేస్తేనే అధికారుల దాడులు

భైంసాటౌన్: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యం పక్కదారి పడుతున్నాయి. జిల్లాలో ఈ దందా అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పొందుతున్న లబ్ధిదారుల నుంచి గ్రామాల్లో తిరిగే చిరు వ్యాపారుల ద్వారా బియ్యం సేకరించి, వాటిని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. ఇలా పోగేసిన బియ్యాన్ని కొందరు అక్రమార్కులు మహారాష్ట్రతోపాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరికొందరు స్థానికంగా రైస్ మిల్లులకు సరఫరా చేస్తున్నారు. ఇలా రేషన్ బియ్యం అక్రమదందా జిల్లాలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. బహిరంగంగానే దందా జరుగుతున్నా.. పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే దాడులు నిర్వహించి చేతులు దులుపుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అంతా బహిరంగమే..

లబ్ధిదారుల నుంచి రేషన్‌బియ్యం కొనుగోలు వ్యవహారం బహిరంగంగానే జరుగుతోంది. చిరువ్యాపారులు కొందరు ద్విచక్రవాహనాలపై గ్రామాల్లో తిరుగుతూ లబ్ధిదారుల నుంచి రేషన్‌బియ్యం కిలోకు రూ.12 నుంచి రూ.15 చొప్పున సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యం పట్టణాల్లోని వ్యాపారులకు రు.18 నుంచి రూ.20కి కిలో చొప్పున విక్రయిస్తున్నారు. ఈ బియ్యాన్ని రహస్య ప్రాంతంలో నిల్వ చేస్తున్నారు. పెద్దమొత్తంలో పోగయ్యాక రూ.25 నుంచి రూ.30లకు కిలో చొప్పున మహారాష్ట్రలోని ధర్మాబాద్, భోకర్ తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. కొందరు స్థానికంగానే రైస్‌మిల్లులకు సరఫరా చేస్తున్నారు. భైంసా పట్టణంలోని గాంధీగంజ్, నిర్మల్ రోడ్‌లోని ఓ వైన్‌షాప్ పక్కన, పార్డి(బి)బైపాస్ రోడ్ సమీపంలో, రాహుల్‌నగర్‌లో, కమలా థియేటర్ రోడ్డులో, మదీనాకాలనీ, ఓవైసీ నగర్‌లోని రహస్య ప్రాంతాల్లో రేషన్‌బియ్యం దందా ఎక్కువగా జరుగుతోంది. కుభీర్, కుంటాల, లోకేశ్వరం, తానూరు, ముథోల్, బాసర, తదితర మండలకేంద్రాల్లో సైతం రేషన్‌బియ్యం దందా కొనసాగుతోంది.

సమాచారమిస్తే చర్యలు..

రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వ ఉంచడం, తరలించడం చట్టరీత్యా నేరం. ఎవరైనా రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినా, వాహనాల్లో తరలించినా పోలీసులకు సమాచారమివ్వాలి. ఇప్పటికే పలుమార్లు దాడులు చేసి రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్నాం. అక్రమదందా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

– కాంతిలాల్‌పాటిల్, ఏఎస్పీ, భైంసా

పట్టుబడుతున్నా ఆగని వైనం...

రేషన్‌బియ్యం అక్రమదందాలో మంచి లాభాలు ఉండడంతో అక్రమార్కులు ఈ దందాను వీడడం లేదు. పలుమార్లు అధికారుల దాడుల్లో పట్టుబడుతున్నా యథావిధిగా దందా కొనసాగిస్తున్నారు. పట్టుబడిన బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు నిర్వాహకులపై కఠినమైన చర్యలు తీసుకోకపోవడంతో దందా ఆగడం లేదని తెలుస్తోంది.

- ఈనెల 23న భైంసా పట్టణంలోని వివేకానంద చౌరస్తా సమీపంలో రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారంతో సీసీఎస్ పోలీసులు దాడి చేసి 12 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు.
- ఈనెల 5న నర్సాపూర్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పోలీసులు పట్టుకున్నారు.
- ఈనెల 17న లోకేశ్వరం మండలకేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్‌బియ్యం సంచులు పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాయి.
- జూన్ 22న భైంసా పట్టణంలోని రాహుల్‌నగర్ ఎస్‌ఎస్ ఫంక్షన్‌హాల్ సమీపంలోని ఓ గోదాంతోపాటు పార్డి(బి)బైపాస్ రోడ్‌లోని మరో దుకాణంలో నిల్వ ఉంచిన 139 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సంఘ బహిష్కరణ చేసినవారిని అరెస్ట్ చేయాలి



నరేశ్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న మోకుదెబ్బ నాయకులు

లోకేశ్వరం: గీత కార్మికుడి కుటుంబాన్ని సంఘ బహిష్కరణ చేసిన వారిని అరెస్టు చేసిన కఠినంగా శిక్షించాలని మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని పిప్రి గ్రామంలోని బాధిత నరేశ్‌గౌడ్ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా నర్సాగౌడ్ మాట్లాడుతూ గీతా కార్మికుడు నరేశ్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచం పట్టాడని తెలిపారు. కల్లుకు సంబంధించిన డబ్బులు చెల్లించాలని వీడీసీ సభ్యులు లోలం రాజేశ్వర్, బోడ చిన్నయ్య, తరుణం శివరాజ్, దాస మహేశ్ తోపాటు మరి కొందరు ఒత్తిడి తెచ్చారన్నారు. డబ్బులు ఇవ్వకపోవడంతో నరేశ్ కల్లు దుకాణానికి వెళ్లొద్దని తీర్మానం చేశారని వెల్లడించారు. ఆయన వెంట భాస్కర్, రమేశ్‌గౌడ్, గుడిసెల శంకర్‌గౌడ్, స్వామిగౌడ్, నగేశ్‌గౌడ్, రమణగౌడ్, శ్రీశైలంగౌడ్, భూమగౌడ్ ఉన్నారు.

అల్లంపల్లికి బస్సొచ్చింది



బస్సుకు స్వాగతం పలుకుతున్న అల్లంపల్లి గ్రామస్తులు

సాక్షి స్పందన

కడెం: జిల్లాలో మారు మూల గ్రామాలకు బస్సులు రాకపోవడంతో ఆయా గ్రామాల మహిళలు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణానికి నోచుకోవడం లేదు. దీనిపై ఈనెల 11న 'బస్సే ఎరుగని పల్లెలు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురించాం. దీనికి స్పందించిన ఆర్టీసీ ఉట్నూర్ డిపో అధికారులు ఈనెల 13న రూట్‌సర్వే నిర్వహించారు. సోమవారం బస్సు ప్రారంభించారు. ఆది, సోమ, గురువారాల్లో అల్లంపల్లి నుంచి ఉట్నూర్‌కు ఉదయం 10, సాయంత్రం 6 గంటలకు, ఉట్నూర్ నుంచి అల్లంపల్లికి ఉదయం 9, సాయంత్రం 5 గంటలకు బస్సు నడుస్తుందని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన పేర్కొన్నారు. తమ గ్రామానికి బస్సు వచ్చేలా కృషి చేసిన 'సాక్షి'కి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ మానవ హక్కుల రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రఘు


ముత్యం రఘు

కడెం: 'నేషనల్ హ్యూమన్ రైట్స్ యాంటి కరప్షన్ అండ్ యాంటి క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని నికొండుకూర్ గ్రామానికి చెందిన ముత్యం రఘు నియామకమయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో సంస్థ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్ జ్యోతీశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. నేటి సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘన, ప్రభుత్వ శాఖల్లో అవినీతి నిఅరికట్టేందుకు, ప్రజల్లో చైతన్యం నింపేందుకు తనవంతు కృషి చేస్తానని రఘు తెలిపారు.

అమరవీరుల స్తూపానికి మంత్రి నివాళి


అమరవీరుల స్తూపం వద్ద మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: ఆదివాసీ అమరవీరుల స్తూపం వద్ద సోమవారం సాయంత్రం అదిలాబాద్ వెళ్తూ మార్గమధ్యలో రాష్ట్ర ఐటీ శాఖ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌తో కలిసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌తో ఇంద్రవెల్లి ఘటనలో మృతిచెందిన అమరవీరుల వివరాలు, స్తూపం అభివృద్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు మెస్రం నాగ్‌నాథ్, సోమసే వెంకటరావ్, సోమోరే నాగోరావ్, ఎండీ మసుద్, సుర కొమురయ్య, పవార్ దుదిరాంనాయక్, విశాల్ ఉన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా సర్పంచుల సమావేశం

నిర్మల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సర్పంచుల సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సొదాని భూమన్నయాదవ్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ సమావేశం ఉంటుందని చెప్పారు. మంత్రి ధనసరి అనసూయను కలువడం, సర్పంచుల సమస్యలపై చర్చ తదితర అంశాలపై సమావేశం ఉంటుందని తెలిపారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడిన వ్యక్తిపై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉండే సింగరి సుమేష్, అజయ్‌లు ఆదివారం రాత్రి క్వార్టర్స్ ఆవరణలో కూర్చొని ఉన్నారు. అదే కాలనీకి చెందిన విశ్వజిత్ అనే వ్యక్తి ఇక్కడ ఎందుకు కూర్చున్నారని దుర్భాషలాడి వారిపై దాడి చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

సొసైటీలకు నిధులొచ్చేనా..?

- జిల్లాలో 57 బీసీ సొసైటీలు
- ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సొసైటీలు కనుమరుగు
- కొత్త సర్కార్‌పై ఆశలు



బీసీ అభివృద్ధి శాఖ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు అప్పటి ప్రభుత్వాలు బీసీ కులవృత్తుల వారికి ఆర్థికంగా అండగా ఉండేందుకు కార్పొరేషన్ ద్వారా బ్యాంక్ లింకేజీ రుణాలను సబ్సిడీపై అందజేసేది. ఆయా ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేసే రుణాలతో వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వ్యాపారాలు ఏర్పాటు చేసుకునే వారు. ఒక్కో సొసైటీలో 11 నుంచి 15 మంది సభ్యులు ఉంటారు. వారు చేసే కులవృత్తిని బట్టి వారికి రూ.10 లక్షల నుంచి రూ.30లక్షల వరకు సబ్సిడీపై రుణాలు అందజేసేవారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సైతం ఈ సొసైటీలు కొనసాగాయి. వీటి సంఖ్య సైతం పెరిగినప్పటికీ అంతగా గుర్తింపు లభించలేదు. ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడంతో సొసైటీలన్నీ కనుమరుగయ్యాయి. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వమైనా సొసైటీలకు గతంలో మాదిరిగా ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి పునర్ వైభవం తీసుకువస్తోందేమోనని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 57..

జిల్లాలో 18 మండలాలు ఉండగా, ఇందులో 57 బీసీ సొసైటీలు ఉన్నాయి. సుమారు 700లకుపైగా సభ్యులు ఉన్నారు. కులవృత్తులను బట్టి యూనిట్లను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకునే అవకాశం ఉంటుంది. వారు చేసుకునే వ్యాపార ఖర్చులకు సంబంధించి కోఆపరేటివ్ సొసైటీ ఆయా ఆర్థిక సంవత్సరంలో ఆడిట్ సైతం చేసేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఆ సొసైటీలకు ఎలాంటి నిధులు విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం ఆ సొసైటీలు పనిచేయడం లేదు. దీంతో సొసైటీలు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

బీసీ అభివృద్ధిశాఖలో కార్పొరేషన్ విలీనం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు బీసీలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందజేసేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బీసీ కార్పొరేషన్‌ను జిల్లాలో పునర్ విభజన జరిగినప్పుడు ఆ శాఖను 2017–18 సంవత్సరంలో బీసీ అభివృద్ధి శాఖలో విలీనం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం బీసీలకు అంతగా రుణాలు అందజేయలేదు. 2017–18లో జిల్లాలోని 2,222 మందికి రూ.50వేలతో వందశాతం సబ్సిడీపై రుణాలు అందజేశారు. 2023లో అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు రూ.లక్ష వంద శాతం సబ్సిడీపై 1,260 మంది మాత్రమే రుణాలు అందజేశారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఆయా ఆర్థిక సంవత్సరంలో ముందుగా ప్రణాళికలను సిద్ధం చేసి సబ్సిడీపై రుణాలు అందజేసేవారు.

గుర్తింపు ఇవ్వాలి



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీపై రుణాలు అందజేసేవారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా సొసైటీల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పింది. దీంతో ఒక్కొక్క సొసైటీ తయారీ కోసం రూ.5వేలు ఖర్చు అయ్యాయి. కానీ ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడంతో సొసైటీలన్నీ కనుమరుగయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సొసైటీలను గుర్తించి నిధులు మంజూరు చేయాలి. కులవృత్తుల వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది.

– చిక్కాల దత్తు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఎలాంటి ప్రయోజనం లేదు



గత ప్రభుత్వ హయాంలో కుల వృత్తుల వారి సొసైటీలకు గుర్తింపు లేకుండా పోయింది. ప్రభుత్వం ఎలాంటి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రయోజనం దక్కలేదు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగా బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి సొసైటీలను గుర్తించాలి. దీంతో కులవృత్తుల వారికి అండగా నిలిచినట్లు అవుతుంది.

– మ్యాకల అశోక్, గంగపుత్ర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఘరానా ముఠా గుట్టురట్టు

- తెల్లకాగితాలతో నోట్ల తయారీ అంటూ మోసం
- రూ.3లక్షలతో పరారీ
- వలపన్ని పట్టుకున్న పోలీసులు
- రూ.2లక్షల 10వేలు, కారు, రెండు బైకులు స్వాధీనం
- నలుగురి అరెస్టు, రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

ఇచ్చోడ: తెల్లకాగితాలతో కరెన్సీ నోట్లు తయారు చేస్తామని నమ్మించి మోసం చేసిన ముఠాను పట్టుకున్నట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ తెలిపారు. ఇచ్చోడలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాకు చెందిన కొంత మంది కొన్ని రోజులుగా ఇచ్చోడ, సిరికొండ మండలాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకొని చీరలను విక్రయిస్తున్నారు. ఈ నెల 19న సిరికొండ మండలంలోని రాజంపేట్‌లో పరిమల్‌గొండ్, కువర్‌దేవిగొండ్‌లు ఇద్దరు మోటార్ బైక్‌పై రాజంపేట్‌లో చీరలను విక్రయించడానికి వెళ్లారు. స్థానికుడైన పెందుర్ జంగుతో మాటలు కలిపారు. తనకు సంతానం లేదని జంగు వారితో తెలిపాడు. అయితే సంతానం కావాలంటే ముందుగా ఇంట్లో లక్ష్మి ఉండాలని, తెల్లకాగితాలతో కరెన్సీ నోట్లు తయారు చేసి ఇస్తామని చెప్పారు. తమ వద్ద అదృష్టశక్తి ఉందని, జంగును మరింత నమ్మించడానికి తమ వెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ బకిట్లో నీళ్లు పోసి అందులో కెమికల్ పోశారు. ముందుస్తుగానే బకిట్లో రెండు వందల నోట్లు రెండు పెట్టి రెండు తెల్లకాగితాలను అందులో వేసి కొద్ది సేపటికి తెల్లకాగితలను వారికున్న నైపుణ్యంతో మాయం చేసి ముందుగా బకిట్లో పెట్టిన రెండు వందల నోట్లను తీసి చూపించారు. లక్షకు కోటి రూపాయలు చేసి ఇస్తామని నమ్మించారు. 21వ తేదీన రూ.3లక్షలు తీసుకుని తన భార్యతో కలిసి రాజంపేట్ నుంచి ఇచ్చోడ బైపాస్ రోడ్డులో వారిని కలిశాడు. అప్పుడే కారులో వచ్చిన గురువు వద్దకు జంగును తీసుకెళ్లి కలిపారు. ఇంత పెద్ద నగదును తయారు చేయడానికి కావాలిస్న కెమికల్ అందుబాటులో లేదని, గంటలో వాటిని తయారు చేసి తీసుకొస్తానని జంగు వద్ద ఉన్న రూ.3లక్షలు తీసుకొని వెళ్లిపోయారు. సాయంత్రం వరకు వారు రాకపోవడంతో జంగు అక్కడి నుంచి రాజంపేట్‌కు వెళ్లిపోయాడు. మోసపోయినట్లు గ్రహించిన జంగు ఈ నెల 22న సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, సీసీఎస్ సీఐ సాయులు ఆధ్వర్యంలో సిరికొండ, ఇచ్చోడ ఎస్సైలు శ్రీకాంత్, నరేష్ సిబ్బందితో కలిసి నాలుగు బృందాలుగా ఏర్పడి దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ నెల 24న ముఠాలోని ఇద్దరి సభ్యులను సిరికొండ మండలంలోని పొన్న ఎక్స్‌రోడ్డు వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా మిగితా సభ్యుల వివరాలు తెలిపారు. దీంతో పర్‌మల్‌గొండ్, కువర్‌దేవి గొండ్, రామ్‌వీర్ గొండ్, నలంసింగ్ గొండ్‌ల వద్ద నుంచి కారు, రెండు బైక్‌లతో పాటు రూ.2లక్షల 10వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠాను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐలు, ఎస్సైలు, సిబ్బంది బిక్‌రాజ్, నవీన్, హోంగార్డు భరత్, సీసీఎస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమవేశంలో ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, ఇచ్చోడ, సిరికొండ ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దైవ నామస్మరణ చేయాలి


స్వాములను సన్మానిస్తున్న వడూర్ గ్రామస్తులు

నేరడిగొండ: ప్రతిఒక్కరూ దైవనామస్మరణ చేయాలని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కుమార్తె వీరనారాయణమ్మ సంతానంలోని ఏడవ తరం మనువడు వీరభద్రస్వామి, సిద్ధయ్య స్వాముల వారి ఎనిమిదవ తరం మనువడు శ్రీరామకృష్ణ పరబ్రహ్మస్వాములు అన్నారు. సోమవారం వడూర్ గ్రామానికి రావడంతో గ్రామస్తులు వారికి స్వాగతం పలికారు. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద భక్తులు వారిని శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం ప్రసిద్ధిగాంచిందని, ఆ మహాత్ముడు చెప్పిన విషయాలు ప్రపంచంలో జరుగుతున్నాయని వివరించారు. ప్రతిఒక్కరూ ఆలయాలను సందర్శిస్తూ పూజల్లో పాల్గొనప్పుడు మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కళ్లెం రామకృష్ణ, పూజారి బ్రహ్మయ్య, గ్రామస్తులు ఉప్పు పోశెట్టి, గాదె శంకర్, కలాలి వెంకటరమణ, కాశన్న, ఆదుముల్ల రాములు, ఆఝెటి రమేష్, తెడ్డు అశోక్, ప్రమోద్, నరేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయాలపాలైన రోహిత్

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–బాసర మార్గంలో సాత్‌పూల్ వంతెన వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. కుభీర్ మండలం సిర్పెల్లితండాకు చెందిన సందేశ్, రోహిత్ బైక్‌పై భైంసా వైపు నుంచి బాసర వైపు వెళ్తుండగా సాత్ పూల్ వంతెన వద్ద ట్రాక్టర్ మలుపు వద్ద యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో రోహిత్ తీవ్రంగా గాయపడగా సందేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌పై నుంచి పడి ఒకరికి..

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి చక్రధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... భైంసా పట్టణానికి చెందిన చక్రధర్ ద్విచక్రవాహనంపై భైంసా నుంచి నిర్మల్‌వైపు వెళ్తుండగా వానల్‌పాడ్ గ్రామ సమీపంలో అదుపు తప్పి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం భైంసాలోని ప్రైవేటు ఆసుపత్రి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన సేవల కోసం నిజామాబాద్ తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని మావల శివారు ప్రాంతంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దస్నాపూర్ కాలనీకి చెందిన కంద లక్ష్మి(58) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కంద లక్ష్మి గత కొన్ని సంవత్సరాలుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. ఇదే క్రమంలో ఇంటి నుంచి బయల్దేరిన ఆమె మావల వైపు వెళ్లింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా భీంపూర్‌కు చెందిన మెస్రం అజయ్ కుటుంబ సభ్యులు ఆడెల్లి దైవదర్శనానికి ఆటోలో వెళ్లారు. ఆదివారం తిరిగి వస్తున్న క్రమంలో కిన్వట్ సమీపంలో ఆటోను లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న మెస్రం శోభ (58)తో పాటు ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. శోభను మెరుగైన వైద్యం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా ఆమె చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై జీవి రమణారెడ్డి తెలిపారు.

గిన్నిస్ బుక్ రికార్డులో చిన్నారులు


జ్ఞాపికలతో బాల కేంద్రం చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన చిన్నారులు భారీ కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగస్వామ్యులయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో భారత అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఒకేసారి 3,783 మంది కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారని శిక్షకుడు మిట్టు దత్తు తెలిపారు. జనుత శబ్దం అనే అంశంపై ఏడు నిమిషాల పాటు నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు. అనంతరం రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావుల చేతుల మీదుగా గిన్నిస్ బుక్ రికార్డు ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు. చిన్నారులు గిన్నిస్ బుక్ రికార్డులో చోటు సంపాదించుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

గిన్నిస్ రికార్డ్‌లో నిర్మల్ కళాకారులు

నిర్మల్‌టౌన్: తెలుగువారి ప్రాచీన నృత్యం కూచిపూడి లెనస్ గిన్నిస్ వరల్డ్ రికార్డుకి ఎక్కింది. ఏకకాలంలో 3,783 మంది కళాకారులు కూచిపూడి నృత్యం చేసి కళావైభవాన్ని ప్రపంచానికి చాటారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం పేరిట లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ ప్రదర్శించారు. స్టేడియం నలుమూలలు ఏడు నిమిషాల పాటు కళాకారులు నృత్యం చేస్తూ అలరించారు. ఇందులో నిర్మల్‌లోని స్వరూపిణి నృత్య కళాక్షేత్రం నుంచి 65మంది కళాకారులు పాల్గొన్నారు. ఇందులో ప్రియదర్శినినగర్‌కు చెందిన బచ్చు కల్యాణి, ప్రసాద్‌ల కుమార్తె బచ్చు మనస్విని సైతం పాల్గొని పురస్కారాన్ని అందుకుంది.

ముధోల్ చిన్నారి..


భుజంగం వరణ్య


ముధోల్ : ముధోల్‌లోని బ్రాహ్మణ్ గల్లీకి చెందిన భుజంగం నాగేష్‌కుమార్–సరిత రాణి దంపతుల కూతురు వరణ్య కూడా కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొంది. మూడో తరగతి చదువుతున్న తమ కూతురు గిన్నిస్‌రికార్డులో భాగస్వామి కావడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మెమోంటోతో ఆనంది,


మనస్విని

తనిఖీ కేంద్రం వద్ద ఒక్కడే..!

- ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద కానరాని ఎక్సైజ్ అధికారి
- తనిఖీ కేంద్రం వద్ద కానిస్టేబుల్ మాత్రమే విధులు
- తెలంగాణకు యథేచ్ఛగా మహారాష్ట్ర మద్యం సరఫరా..?


ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్

బోథ్: బోథ్ మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ తనిఖీలు నామమాత్రంగా సాగుతున్నాయి. దీంతో మహారాష్ట్ర నుంచి తెలంగాణ రాష్ట్రానికి మద్యం సరఫరా యథేచ్ఛగా కొనసాగుతోంది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ శాఖ చెక్‌పోస్టు ఏర్పాటు చేసినా... ఈ రహదారి గుండా అక్రమంగా మద్యం రవాణా కొనసాగుతోంది. పలుమార్లు ఎక్సైజ్ అధికారులు అక్రమంగా తరలుతున్న మద్యాన్ని పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. కొంత కాలంగా ఎక్సైజ్ అధికారులు వాహనాలను సరిగా తనిఖీలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్‌శాఖ ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుల్‌లు చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో ఉండాలి. అయితే ఈ నెల 24వ తేదీన ఆదివారం చెక్‌పోస్టు వద్ద రాత్రి విధుల్లో కేవలం ఒక కానిస్టేబుల్ మాత్రమే ఉన్నాడు. ఆయన ఒక్కరే ఉండటంతో వాహనాలను తనిఖీ చేయడం భారంగా మారింది. విధుల్లో ఉండాల్సిన ఎక్సైజ్ అధికారి లేకపోవడం చూస్తే చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ఎలా ఉన్నాయో తెలుస్తోంది.

రూ.లక్షల్లో మద్యం సరఫరా...

ఎక్సైజ్ అధికారులు సరిగా విధులు నిర్వహించకపోవడం, కేవలం కానిస్టేబుళ్లను మాత్రమే తనిఖీ కేంద్రాల వద్ద ఉంచడంతో తనిఖీలు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. దీంతో రూ.లక్షల్లో మద్యం మహారాష్ట్ర నుంచి తెలంగాణకు మద్యం సరఫరా అవుతోంది. వివిధ కార్యక్రమాలు, పెళ్లిళ్లు, శుభకార్యాలకు పెద్ద మొత్తంగా మహారాష్ట్ర నుంచి తెలంగాణకు మద్యం సరఫరా అవుతోంది. లక్షల్లో మద్యం సరఫరా అవుతున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలకు తావిస్తోంది.

విద్యుత్ వైరు తొలగింపుపై వివాదం..


బోరువద్ద వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

ఖానాపూర్: పట్టణంలోని 5వ వార్డు పరిధిలోని ఇంద్రనగర్ కాలనీలో బోరుకు ఉన్న విద్యుత్‌వైరు తొలగింపుపై సోమవారం వివాదం నెలకొంది. దీంతో కాలనీకి చెందిన ఇరువురు అక్కడికి చేరుకుని ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. కాలనీలోని పలువురి ఇళ్లకు బోరు ద్వారా నీటి సరఫరా సదుపాయాన్ని ఏర్పాటు చేస్తే రాత్రుళ్లు కొంతమంది బోరును నడిపిస్తుడడంతో గతంలో పలుమార్లు బోరు కాలిపోయిందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పరిమి సురేశ్ తెలిపారు. బోరు నడుస్తున్న ప్రతీసారి తాము బోరును ఎన్నిసార్లు ఆఫ్ చేసిన వారు తీరు మార్చుకోవడం లేదని పేర్కొన్నారు. దీంతో తాను విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు వైరును తొలగిస్తే విద్యుత్ షాక్ పెట్టానని, తనపై దుష్ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. బోరు కాలిపోయిన సమయాల్లో మున్సిపాలిటీ నుంచి ఎవరు స్పందించకపోవడంతో తానే సొంత డబ్బులతో బోరు ఏర్పాటు చేయడంతో పాటు మరమ్మతులు చేయించానని తెలిపాడు. కాలనీకి చెందిన కాశవేని ప్రణయ్, అతడి కుటుంబీకులు మాట్లాడుతూ వైరు ఎవరు తొలగించారనేది తెలియదని, వైరు తొలగించిన చోట ప్రమాదకరంగా కనిపించడంతో ఎవరైనా కావాలని చేశారా అనే విషయమై తాను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు తెలిపారు.

ఆదర్శం పెంచికల్‌పాడ్ రైతులు


విద్యుత్ బిల్లులు చెల్లించిన రసీదులతో రైతులు

కుంటాల: క్రమం తప్పకుండా వ్యవసాయ వి ద్యుత్ బిల్లులు చెల్లించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు నిర్మల్ జిల్లాలోని కుంటాల మండలం పెంచికల్‌పాడ్ గ్రా మ రైతులు. గ్రామంలో 137 వ్యవసాయ వి ద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో మీటరుకు ఏ డాదికి రూ.320 రైతులు చెల్లించాల్సి ఉంటుంది. సోమవారం గ్రామానికి వచ్చిన విద్యుత్ అధికారులకు రైతులు రూ.58 వేల 320 బకా యిలు లేకుండా చెల్లించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా రైతులను విద్యుత్ ఏఈ శివప్రసాద్ అభినందించారు. మిగతా రైతులు వీరిని ఆదర్శంగా తీసుకొని బిల్లులు చెల్లించాలని కోరారు.